# 20

## మరుగు పడిన మానవత

ఊహకు వాస్తవానికి మధ్య, భావనకూ బతుక్కూ మధ్య కొద్ది తేడాలుండడం వేరు. అపారమైన భేదాలుండడం వేరు. మొదటి స్థితిని భరిస్తాం, రెండవ స్థితినీ భరిస్తాం, కానీ ఈ రెండవ స్థితి అమానుషంగా ఉంటుంది. అలా ఉంటుందని అనడానికి 'సావిత్రి' జీవితమొక మచ్చుముక్క.

"ఇప్పుడంటే ఇలా అయిపోయింది గానీ చిన్నప్పుడు సావిత్రి బొద్దుగా, గుమ్మడి పాదులా, ముచ్చటగా వుండేది. దానికి తోడు మునుముకు ముందు పుట్టిన బిడ్డ గనక, అచ్చటా ముచ్చటా అన్నీ తార్చారు అమ్మా నాన్నా.

"ఇప్పుడిట్లా మాడిపోయాను గానండి చిన్నప్పుడు బొదబొదలాడుతూ, నీడలు తేలుతూ వుండేదాన్నటండీ. బాగా పాడీపంటా వున్న కుటుంబం" అన్నది సావిత్రమ్మ.

అలాంటి కుటుంబం బాగా చిదికిపోయింది. సావిత్రికి కాస్త ఊహ తెలిసే నాటికి అమ్మా నాన్నా కూలిచేసి బతుకుతున్నారు. వాళ్ళతో బాటు తనూ కూలిపని చేసింది కలుపు తీయడం, మిరపనాట్లు, ఎరువు చల్లిక, శనక్కాయకోత, కందికోతలాంటి పనులన్నీ చేసింది.

"మొదట్నుంచి నా బతుకు కష్టాల బతుకే అయిందండీ. చిన్నప్పుడెప్పుడన్నా సుఖపడ్డానేమో నాకు గుర్తు లేదు. సుఖమన్నది ఇంతవరకూ లేదు." అన్నది సావిత్రమ్మ చీరిన మిరపకాయల్లోకి మసాలాను కూరుతూ.

ఆ పనుల రోజుల్లోనే తనకు దూరంగా మేనమామ వరస అయ్యే చుట్టం ఒకడు బస్తీనుంచి వచ్చాడు. వచ్చి తమింట్లోనే దిగాడు. తన పెళ్ళి విషయం అమ్మ ప్రస్తావించింది. ఆ మామయ్య అదెంత పని అన్నట్లు మాట్లాడాడు. వారం రోజులకల్లా మామయ్య ఇంకో పాతికేళ్ళ కుర్రాణ్ణి వెంటబెట్టుకొచ్చాడు. అతగాడు గుంటూరు జూట్ మిల్లులో నాలుగు డబ్బులు సంపాయిస్తున్నాడు. సావిత్రికి అతనికి పెళ్ళయిపోయింది.

"ఆ తరువాతగానీ, ఆ మాయ నాకు తెలియలేదయ్యా!" అన్నది సావిత్రమ్మ, ఆ జ్ఞాపకాలను తలుచుకొని వణికిపోతూ.

సావిత్రిని పెళ్ళి చేసుకొన్న ఆ దౌర్భాగ్యుడు ఆమెను గుంటూరు తీసుకెళ్ళాడు. రెండు రోజుల తరువాత రాజమండ్రికి తీసుకెళ్ళాడు. రాజమండ్రిలోనే ఆమెను వో కంపెనీకి అమ్ముకొన్నాడు. అలా అమ్ముకొంటాడన్న అనుమానం ఏపాటి కలిగినా సావిత్రమ్మ వాణ్ని చీల్చి ఉండేది. రాజమండ్రి నుండి అమలాపురం, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, తెనాలి, విజయవాడ, ఇలా తను ఊరూరా తిరిగింది. తిరిగిందనడం తప్పు తనను ఊరూరా తిప్పారు. ఈ అయిదారు సంవత్సరాల్లో తను సర్వనాశనమయిపోయింది. తనకు తనది అని చెప్పుకోదగ్గదేమీ మిగల్లేదు.

విజయవాడలో ఉన్నప్పుడు తనకు పారిపోయే అవకాశం కలిగింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నది సావిత్రమ్మ. ఆమెనెవరో తీసుకెళ్లారు. తెల్లవారుజామున ఆమెను రిక్షా ఎక్కించి రెండు రూపాలు చేతికిచ్చి పంపించాడారసికుడు. రిక్షా రైల్వే బ్రిడ్జి క్రిందగా వస్తున్నప్పుడు సావిత్రమ్మకో ఆలోచన వచ్చింది. రిక్షాను స్టేషనువైపు పట్టించింది. కదలడానికి సిద్ధంగా ఉన్నరైల్లోకొచ్చి పడ్డది.

"ఇక్కడా చాలా కష్టాలు పడ్డాను బాబుగారూ. ముందుగా రౌడి నా కొడుకులు వెంటపడ్డారు. భగవంతుని దయవల్ల తప్పుకొన్నా. ముందుగా గంటలమ్మ చెట్టు దగ్గరున్న గుడిసెల్లో వుండేదాన్ని. ఏడాది క్రిందటే ఈ సినిమాహాలు పక్కకొచ్చాను" అన్నది సావిత్రమ్మ.

ఆవిడ ఈ ఊరు రాగానే ఆదరించినవాడు వెంకటేశం. అతను వేలం పాటపాడే కంపెనీలో పనిచేస్తున్నాడు.

"ఆ మహారాజే నాకింత నీడ చూపించాడయ్యా" అన్నది సావిత్రమ్మ. అక్కడెక్కడో వున్న వెంకటేశానికి చెయ్యెత్తి దణ్ణం పెడుతూ.

అతనికి బరువుగా తయారవకూడదన్న ఉద్దేశ్యంతోనే సావిత్రమ్మ ఈ వ్యాపారం ప్రారంభించింది. సావిత్రమ్మకి వంటకాలేమీ మొదట్లో చాతకావుట. ఒకటో, రెండో చేడ్డాక ఇప్పుడు ఆరితేరానంటున్నదామె.

"మిర్చిబజ్జీ, ఆలుబజ్జీ, మసాలా వడ, చక్కెరాలు, జంతికలు, అప్పడాలు, ఆలుబోండా, బూంది అన్నీ చేస్తాను. సాయంకాలం 5 గంటల నుంచీ, రాత్రి పదకొండు గంటలదాకా బేరం ఉంటుంది" అన్నది సావిత్రమ్మ.

తను సెనగపిండి వాడనన్నది. ధర తక్కువ గనక భఠాణీ పిండిని వాడుతానన్నది. అందులో జొన్నపిండి కూడా కలుపుతాననీ, రంగుకోపం మిఠాయిల్లో వాడే రంగుల్ని కలుపుతానన్నది.

"మసాలా వడకు సెనగపప్పే వాడాలండీ. లేకపోతే వడకు రుచి రాదు" అన్నదామె. బజ్జీ మిరపకాయలు, ఉల్లిపాయలు తను రోజూ మార్కెట్ కెళ్ళి కొనుక్కవస్తుంటానంది. మిరపకాయబజ్జీల్లో రెండు రకాలు తయారు చేస్తుంది. ఒకరకం పావలాకు రెండు. ఇంకో రకం 20 పైసలకు రెండు చొప్పున యిస్తుంది. రోజుకు 40, 50 రూపాయల దాకా అమ్ముతుంది. అన్ని ఖర్చులూ పోను 10, 12 రూపాయల దాకా మిగులుతాయి.

కల్తీనూనె వాడననీ అలా వాడటం వల్ల కాతాదారులు రారనీ, సావిత్రమ్మ చెప్పింది. సెగ తగలగానే పొగలు రేగే నూనెలు వాడడం వల్ల నూనె బానలిలో మరిగి ఆవిరయిపోతుందనీ, అది నష్టమనీ సావిత్రమ్మ అన్నది.

"ఎండాకాలంలో గిరాకీ తక్కువగా వుంటుంది. వానాకాలం, చలికాలం బేరాలు బాగా ఉంటాయి".

వెంకటేశానికి భార్య చచ్చిపోయి చాలా కాలమయింది. ముగ్గురు పిల్లలు ఉన్నారు.

"ఆ ముగ్గురూ నా పిల్లలే అనుకుంటున్నా. వాళ్ళకోసమే ఇదంతా. నా రాత ఎట్లాగూ నాశనమయింది బాబూ ఏ జన్మలో ఏ పాపం చేసుకున్నానో తెలియదు. వచ్చే జన్మలోనయినా సుఖపడితే అంతే చాలు" అన్నది సావిత్రమ్మ దోరగా వేగిన మిరపకాయబజ్జీలను, బానలిలోంచి పైకి తీస్తూ.